మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం : రామకృష్ణ



తాగునీటి పైపులైను పనులను ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్ వ్యాప్తంగా అన్ని కాలనీలు, బస్తీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యమని బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్ ఆరోవార్డు పరిధిలోని మహా మాతాజీ నగర్, భావన కాలనీలో బోర్డు నిధులతో చేపట్టిన తాగు నీటి పైపులైను పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బస్తీ బాట కార్యక్రమంలో స్థానిక ప్రజలు మంచినీటి పైప్ కావాలని అడగగా బోర్డు అధికారుల ద్వారా తాగు నీటి పైప్ లైన్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. కంటోన్మెంట్ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి పని చేస్తుందన్నారు. ఎన్నడూ లేనివిధంగా గత పది సంవత్సరాలుగా కంటోన్మెంట్ లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. రాష్ట్రంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కానీ మాటలు చెబుతూ మోసం చేయడం మినహా అభివృద్ధికి ఎలాంటి నిధులు ఇవ్వడం లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవతో రాబోయే కాలంలో కంటోన్మెంట్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆరోవార్డు బీజేపీ అధ్యక్షులు అజయ్ గౌడ్, బిజెపి నాయకులు ప్రతీక్ జైన్, భీమరాజం, వేణు, గంగాధర్, సుదర్శన్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఓయూ మోడల్ స్కూల్‌పై అధికారుల నిర్లక్ష్యం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని మోడల్ స్కూల్ పై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. యూనివర్సిటీ బీఈడీ కాలేజీకి అనుబంధంగా ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉచితాలు లభించడం లేదు. ఇక్కడ చదివే విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. గతంలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం, పండ్లు, గుడ్లు తదితరాలను ఉచితంగా సరఫరా చేశారు. కానీ గత రెండేళ్లుగా ఓయూ అధికారులు పట్టించుకోక పోవడం వలన ఉచితాలు రద్దు అయ్యాయి. వర్సిటీ తరఫున స్కూల్‌కు స్పెషల్ ఆఫీసర్ పదవిలో కొనసాగిన ప్రొ.శంకర్ రెండు నెలల క్రితం ఢిల్లీలోని ఎన్ఐఈపీఎస్‌లో ప్రొఫెసర్‌గా చేరారు. ఇంత వరకు కొత్త స్పెషల్ ఆఫీసర్‌ను నియమించక పోవడంతో మోడల్ స్కూల్ సమస్యలను తీర్చేవారు లేరు. గత వీసీ ప్రొ.రవీందర్ సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాల నిర్వహణకు ఓయూ మోడల్ స్కూల్‌లో



ఓయూ మోడల్ స్కూల్ విద్యార్థులు

ఆశ్రయం కల్పించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బట్టలు, భోజనం, పండ్లు, గుడ్లు లభిస్తుండటంతో మోడల్ స్కూల్ విద్యార్థులు తమకు కూడ ఉచితాలు లభించాలని ఆశతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి లభించు ఉచితాలను అందేల ఓయూ నూతన వీసీ ప్రొ.కుమార్‌ను మోడల్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శరవేగంగా తార్నాక జంక్షన్ పునరుద్ధరణ పనులు



కొనసాగుతున్న తార్నాక జంక్షన్ పునరుద్ధరణ పనులు



రోడ్డుపై మార్కింగ్ చేస్తున్న అధికారులు

లాలాపేట: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న తార్నాక జంక్షన్ (సిగ్నల్) పునరుద్ధరణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇంత కాలం రోడ్డుకు అడ్డంగా ఉన్న డివైడర్లను తొలగించారు. ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం, సిగ్నల్ లైటింగ్ సిస్టమ్ తదితర పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ అధికారులు పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు. ఈ మార్పులకు సంబంధించి రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు రాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

చిలకలగూడ: విద్యార్థులకు ఆరోగ్యవంతమైన పౌష్టిక ఆహారం అందించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాలను బుధవారం సందర్శించిన ఆమె మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీకు సంబంధించిన నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో పలు అంశాలపై చర్చించారు. ప్రిన్సిపాల్ జయలక్ష్మీ, రమేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాలు నిర్మాణ పనులు పరిశీలన

మధురానగర్‌కాలనీలో జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాలు మూడవ అంతస్తు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమ పరిశీలించారు. ఫంక్షన్ హాలులో వినియోగదారులకు మరిన్ని సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు రూ. 40 లక్షల వ్యయంతో అదనంగా మరో అంతస్తు నిర్మిస్తున్నట్లు తెలిపారు.



విద్యార్థులతో కలిసి ఆహార పదార్థాలను రుచి చూస్తున్న కార్పొరేటర్ హేమ

అండర్‌గ్రౌండ్ కేబుళ్ల దొంగలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి తదితరులు

- 350 కిలల కాపర్ వైర్ స్వాధీనం
- ఐదుగురి రిమాండ్

సనత్‌నగర్: అండర్‌గ్రౌండ్ బీఎస్ఎన్ఎల్ కేబుల్ దొంగతనానికి పాల్పడిన నలుగురితో పాటు సొత్తు కొనుగోలు చేసిన మరో వ్యక్తిని బేగంపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి మూడున్నర లక్షల విలువ చేసే 350 కిలోల రాగి తీగను స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య, డీఐ మధుసూదన్‌లతో కలిసి ఏసీపీ గోపాలకృష్ణమూర్తి బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పరేడ్‌గ్రౌండ్ ఈస్ట్ గేటు రోడ్డు పక్కన 90 మీటర్ల మేర అండర్‌గ్రౌండ్ కాపర్ కేబుల్ చోరీకి గురైందని, దీని వల్ల బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు దెబ్బ తిన్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బీఎస్ఎన్ఎల్ ప్యాట్నీ టెలిఫోన్ ఎక్స్చేంజ్‌కు చెందిన ఎస్‌డీఈ మారుతి బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా బేగంపేటలోని అన్నానగర్ ఎక్స్‌రోడ్డులో వాహన తనిఖీలు చేస్తుండగా ఏపీ37 టీకే 2189 నెంబర్ గల బొలేరో వాహనంలో నలుగురు వస్తుండగా వాహనం ఆపి పరిశీలించారు. వారి వాహనంలో తవ్వడానికి ఉపయోగించే రెండు ఇనుప తవ్వకాల బార్‌ను గమనించారు. అనుమానాస్పదంగా ఉన్న తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వేముల సింహాద్రి (28), సింహాద్రి (38), ఏలూరు జిల్లాకు చెందిన గుంజా దుర్గాప్రసాద్ (21), వేముల ఆనంద్ (22)లను అదుపులోకి తీసుకుని విచారించగా తామే కేబుల్స్ దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. ఈ నలుగురితో పాటు వీరు దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన మహబూబాబాద్ జిల్లాకు చెందిన తోట రామారావును కూడా అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 350 కిలోల కాపర్‌వైర్, ఒక బొలేరో వాహనం, రెండు క్రౌబార్లు స్వాధీనం చేసుకున్నారు. అయితే వీరు గతంలో కూడా పలుమార్లు ఇదేవిధంగా వైర్లను దొంగిలించగా తరచూ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందుతుండడంతో దీనిపై బీఎస్ఎన్ఎల్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించడంతో నిందితులు పట్టుబడ్డారు.

సారీ.. నో సిరప్

బస్తీ దవాఖానాల్లో కరువైన దగ్గుమందు



శ్యాంలాల్ బిల్డింగ్ బస్తీ దవాఖానాను సందర్శించిన కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

- బయట తీసుకోవాలంటున్న సిబ్బంది
- ప్రజా ఆరోగ్యంపై నిర్లక్ష్యం?

సనత్‌నగర్: సీజన్ మారిన కొద్దీ సీజనల్ వ్యాధులు ముంచుకురావడం పరిపాటి. ఆ క్రమంలోనే చలిగాలుల తీవ్రత పెరిగింది. దీంతో దగ్గు, జలుబు, జ్వరాలతో ఆస్పత్రికి వచ్చేవారి సంఖ్య పెరిగింది. నిరుపేద, సామాన్య ప్రజలు నివాసం ఉండే బస్తీ నివాసితులకు ఏదైనా సుస్తీ చేసిందంటే సర్కారీ దవాఖానాలనే ఎక్కువగా ఆశ్రయిస్తుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని యూపీహెచ్‌సీ సెంటర్లకు తోడుగా గత ప్రభుత్వం బస్తీ దవాఖానాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక్కో దవాఖానాలో అర్హత కలిగిన డాక్టర్‌తో పాటు ఫార్మసిస్టు, సహాయకులను కూడా నియమించి బస్తీల చెంతకే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకుచ్చారు. అలాగే అవసరమైన మందులను కూడా ఇక్కడే అందజేస్తుంటారు. అయితే ఇప్పుడు దవాఖానాలకే సుస్తీ చేసిందా? అన్న అనుమానం కలుగుతోంది. ఎందుకంటే సీజనల్ వ్యాధుల్లో ఎక్కువగా దగ్గుతో బాధపడుతూ వచ్చేవారే 90 శాతం మంది ఉంటున్నారు. అయితే వారికి దగ్గు మందు ఇచ్చే పరిస్థితులు లేవు. బీపీ, షుగర్ ట్యాబ్లెట్లు కూడా అంతంతమాత్రమే. అదేమంటే స్టాక్ రాలేదంటూ చేతులెత్తేస్తున్నారు. మరికొన్ని చోట్ల సిరప్ ఇవ్వాల్సి ఉన్నా కూడా ట్యాబ్లెట్లతోనే సరిపెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చాలా చోట్ల అసలుకే దగ్గు మందు లేదు. ఒకవేళ ఉన్నా ఇప్పుడు కొరత ఉందని, బయట తీసుకోండంటూ చెప్పి పంపిచేస్తున్నట్లు తెలుస్తోంది.



- సనత్‌నగర్ నియోజకవర్గంలో సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేటలలో డివిజన్‌కు రెండు నుంచి నాలుగు చొప్పున బస్తీ దవాఖానాలు కొనసాగుతున్నాయి. అత్యధికంగా బేగంపేటలో నాలుగు బస్తీ దవాఖానాలు ఉన్నాయి. దాదాపుగా అన్నింట్లోనూ దగ్గు మందు కొరత ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే చల్లని వాతావరణం కారణంగా జలుబు, దగ్గు సమస్యలతో బాధపడుతూ వచ్చేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఇలాంటి సమయంలో కూడా దగ్గు మందు అందుబాటులో లేకపోవడంతో ఆయా ప్రాంత నివాసితులు బయట మెడికల్ షాపుల్లో కొనుక్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

దగ్గు మందు కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. స్టాక్ రావాల్సి ఉంది. ప్రతిసారీ నెల రోజుల ముందే ఇండెంట్ పంపిస్తుంటాం. ఈ సారి ఎందుకో ఆలస్యమైంది. దగ్గు మందు కొరత అయితే ఉంది గానీ అత్యవసరమైన వారికి ఇస్తూ వస్తున్నాం.

– సుష్మ, అల్లావుద్దీన్ కోఠి బస్తీ దవాఖానా వైద్యురాలు..

పిల్లలకు హాఫ్ ట్యాబ్లెట్లు ఇస్తున్నాం

దగ్గు సిరప్ కొరత ఉండడంతో ట్యాబ్లెట్లు ఇస్తున్నాం. ఇక చిన్న పిల్లలు అయితే హాఫ్ ట్యాబ్లెట్ వేసుకోమని చెబుతున్నాం. దగ్గు మందు కొరత అంశాన్ని ఉన్నతాధికారులకు ఇప్పటికే తెలియజేశాం.

– సుజాత, బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ బస్తీ దవాఖానా వైద్యురాలు..

ఇది ప్రభుత్వం వైఫల్యం

బస్తీ దవాఖానాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం చెందిందని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి అన్నారు. బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని బస్తీ దవాఖానాను ఆమె సందర్శించారు. మందులు సరిగా లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కనీసం దగ్గు మందు, బీపీ, షుగర్ ట్యాబ్లెట్లు లేకపోవడం బాధాకరమన్నారు.

– బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి..

రాజేశ్వరికి ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ సీఎస్‌సీ విభాగం నుంచి పి.రాజేశ్వరికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ అధ్యాపకురాలు ప్రొ.శ్యామల పర్యవేక్షణలో చెస్ట్ సీటీ స్కాన్ మెడికల్ ఇమేజీ సూపర్ రిజల్యూషన్ అండ్ క్లాసిఫికేషన్ యూజింగ్ డీప్ లర్నింగ్ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు.

నేడు సీతాఫల్‌మండిలో బీజేపీ బహిరంగసభ

చిలకలగూడ: బీజేపీ అధినాయకత్వం ఆదేశాల మేరకు ఈనెల 5వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగసభ నిర్వహించనున్నట్లు బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు అబద్దాలు, అరవైఆరు మోసాలుపై ప్రజలకు చైతన్యవంతులను చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా ట్రేడ్ యూనియన్ ఎన్నికలు

అడ్డగుట్ట: రైల్వేలో ట్రేడ్ యూనియన్ల గుర్తింపు ఎన్నికల పోలింగ్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం, హైదరాబాద్ భవన్, సంచాలన్ భవన్, ఎస్అండ్‌టీ ఎలక్ట్రికల్ బ్రాంచ్, లాలాగూడ వర్క్‌షాప్, ఎలక్ట్రిక్ లోకో షెడ్ తదితర రైల్వే కార్యాలయాలు, వర్క్‌షాపుల్లో జరిగిన పోలింగ్‌లో సుమారు 40 నుంచి 50 శాతం వరకు ఓట్లు పోలయ్యాయి. రైల్వేలో గుర్తింపు కోసం మొత్తం దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్, ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్లు పోటీ పడుతున్నాయి. ఈ నెల 4, 5, 6 తేదీల్లో పోలింగ్ జరుగుతున్న క్రమంలో రైల్వే ఉద్యోగులు, కార్మికులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అయితే, ప్రధానంగా 4, 5 వ తేదీల్లోనే పోలింగ్ ఉండగా, రన్నింగ్ స్టాఫ్ ఉద్యోగుల కోసం 6వ తేదీ(శుక్రవారం) ఓటు వేసేందుకు వారికి కేటాయించినట్లు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి

బంజారాహిల్స్: నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వ ప్రజా సంబరాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం బంజారాహిల్స్ రోడ్ నం.12లోని సీఎంటీసీ భవన్‌లో స్వీపర్ల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలోని కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్‌తో పాటు జనరల్ మెడిసిన్‌ను కార్మికులకు ఉచితంగా అందించినట్లు ఏఎంహెచ్‌వో భార్గవ నారాయణ తెలిపారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కాంగ్రెస్ సర్కారు మహిళా సాధికారితకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవ సంబరాలలో భాగంగా 'ఇందిరా మహిళా శక్తి' పేరిట బుధవారం మారేడుపల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గం పరిధిలోని 24 మహిళా సంఘాలకు చెందిన 240 మంది మహిళలకు రూ.2.36 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తూ మహిళలను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యులను చేస్తుందని అన్నారు.



మహిళా సంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

తెలంగాణలో మహిళల ఆర్థిక సాధికారిత సాధించాలనే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈవో విజయ్ పల్లవి, మెప్మా అధికారి ప్రకాష్, బ్యాంకు అధికారులతో పాటు వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్ పనులు ప్రారంభం



చాచానెహ్రూనగర్‌లో మంచి నీటి పైపులైన్ పనుల ప్రారంభ దృశ్యం

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో బుధవారం మంచినీటి పైపులైన్ పనులు ప్రారంభమయ్యాయి. సీసీ నగర్ డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో నీటి సమస్యతో చాలా కాలం నుంచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై స్థానికులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ కె. హేమలతలక్ష్మీపతి దృష్టికి తీసుకెళ్లారు. నీటి సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ కె. హేమలత జలమండలి అధికారులకు సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జలమండలి అధికారులు నూతన మంచినీటి పైపులైన్ వ్యవస్థ కోసం ప్రతిపాదనలు రూపొందించారు. నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. పనుల ప్రారంభ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, అచ్చా, భీమ్‌రావు, కేపీ నర్సింగ్, రమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

బౌద్ధనగర్: గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ఘోరంగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్‌గౌడ్ అన్నారు. బుధవారం బౌద్ధనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం గడిచినా ఇప్పటివరకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన గ్యారంటీలను గాలికి వదిలేశారన్నారు. మహాలక్ష్మి పథకం, గ్యాస్ సిలిండర్ ధరల తగ్గింపు, రైతులకు పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఇండ్లు వంటి మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేశాడన్నారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని, అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడమే వారి విధానమని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాపడి పూజ, గణపతి హోమం



శ్రీ అయ్యప్పస్వామి మహాపడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన శ్రీ పాల్‌బాగ్ హనుమాన్ దేవాలయంలో బుధవారం శ్రీ అయ్యప్పస్వామి మహాపడి పూజా, గణపతి హోమం పూజా కార్యక్రమాలు భక్తిప్రపత్తుల మధ్య నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన అయ్యప్పభక్తుల సమక్షంలో పూజా కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. వీరమణికంఠ సేవా సంఘం అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎంఎన్. శ్రీనివాస్, ఎడ్ల హరియాదవ్, వీరమణికంఠ సేవా సమితి ప్రతినిధులు కోడూరు రాజు, దేవరాజ్, చిరంజీవి గౌడ్, గోపన్న, రాజుస్వామి తదితరులు పాల్గొన్నారు. పూజా అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరమణికంఠ సేవా సమితి అధ్వర్యంలో పద్మారావునగర్ పాల్‌బాగ్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ప్రతి రోజూ మధ్యాహ్నం అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సమితి ప్రతినిధులు కోడూరు రాజు, దేవరాజ్‌లు చెప్పారు. శ్రీధర్, సాఫ్ట్‌వేర్ శ్రీనివాస్, లింగం, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా 29, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 23, పచ్చకాకర 32, పందిరి బీర 23, క్యాబేజీ 23, క్యారెట్ 55, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 40, గోకరకాయ 23, కీర 20, దోసకాయ 23, బీట్‌రూట్ 50, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 38, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

7న అవగాహన కార్యక్రమం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ జంతుశాస్త్రం విభాగం మ్యూజియం పై ఈ నెల 7న అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. వివిధ దేశాలలోని నిర్జీవ జంతువుల మ్యూజియాలను పరిగణలోకి తీసుకొని ఓయూలోనూ మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. జంతువులు, పక్షులు, వివిధ రకాల క్షీరదాలు, పాములు, తేళ్లు, ఇతర జీవరాసుల గురించి వివరించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే అవగాహన కార్యక్రమానికి ఓయూ పరిధిలోని డిగ్రీ, పీజీ కాలేజీల విద్యార్థులతో పాటు పీహెచ్‌డీ స్కాలర్స్ కూడ హాజరుకావచ్చని అధికారులు తెలిపారు.

తార్నాక డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అనిరుధ్



లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్(143) యూత్ కాంగ్రెస్ ప్రసిడెంట్‌గా శాంతినగర్ ఆర్యనగర్‌కు చెందిన బక్కల అనిరుధ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలను బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా అనిరుధ్ మాట్లాడుతూ తనను డివిజన్ ప్రసిడెంట్‌గా ఎన్నుకున్న యూత్ కాంగ్రెస్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా ఘంటసాల జయంతి



ఘంటసాల సంగీత విభావరి కార్యక్రమంలో పాల్గొన్న లలిత కళా సమితి బృందం

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయం ఆడిటోరియంలో దక్షిణ మధ్య రైల్వే లలిత కళా సమితి ఆధ్వర్యంలో బుధవారం అమర గాయకుడు ఘంటసాల 102 జయంతిని పురస్కరించుకొని ఘంటసాల విభావరి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, గాయకుడు డి.ఏ. మిత్ర ఘంటసాల గానం చేసిన పాటలు, పద్యాలు, శ్లోకాలు, రాగ, భావ యుక్తంగా పాడి ఆహుతులను అలరించి వారి నుండి కరతాళ ధ్వనులందుకున్నారు. సమితి మాజీ కార్యదర్శి మంత్రి భుజంగరావు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఓయూలో ఏబీవీపీ నగర మహాసభలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఏబీవీపీ భాగ్య నగర మహాసభలను ఈ నెల 10న ఓయూలో నిర్వహించనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ ఎదుట పోస్టర్‌ను ఆవిష్కరించారు. వర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ సీనియర్ నాయకులు పృథ్వీతేజ, పగిడిపల్లి శ్రీహరి, అలివేలి రాజు, సురేష్, శివశంకర్, ధృవన్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



చిలకలగూడ: చిలకలగూడ ప్రధాన రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలను చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. పాదచారులు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో చిలకలగూడ గాంధీ విగ్రహం నుంచి మైలార్‌గడ్డ వై జంక్షన్ వరకు ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాలు, షెడ్లు, తోపుడు బండ్లు, పాన్‌డబ్బాలను తొలగించారు. పలువురు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి జరిమానా విధించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈస్ట్ జోన్ ఏసీపీ సంపత్‌కుమార్ హెచ్చరించారు.

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

రాంగోపాల్‌పేట్: సామాజిక మాధ్యమాలు ఉపయోగించే విద్యార్థుల మనసులపై అవి ప్రతికూల ప్రభావాలు చూపిస్తాయని అందువల్ల జాగ్రత్తగా ఉండాలని ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. సికింద్రాబాద్‌లోని సెయింట్ ప్యాట్రిక్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని, వీలైనంత తక్కువ సమయాన్ని వాటికి కేటాయించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాల గురించి వారితో చర్చించారు. ఏదైనా సమస్య వచ్చినపుడు వెంటనే 100కు కాల్ చేసి పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ సుబ్బయ్య, గోపాలపురం ఇన్‌స్పెక్టర్ నరేష్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎలాంగో తదితరులు పాల్గొన్నారు.